క్లుప్తంగా

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పొట్టపింజర రత్నం, తూములూరి మోహన్‌రావు, కలవాల పుష్పావతి, యంద్రపుడి రామచంద్రరావు, పొనమల శ్రీనివాస్, బొడ్డు నారాయణ, నూనె విజయ, దారా మహలక్ష్మి, సోమరాజు మహీరాబాయి మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్.వి ప్రసాద్, వాసన్, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్. అనంత పద్మనాభం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

త్వరలోనే ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం సహకారనగర్: జిల్లా సకల ప్రభుత్వ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యాన త్వరలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించినట్లు వేదిక బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, ఎల్ఐసీ, రైల్వే, ఆర్టీసీ, డ్రైవర్లు, అంగన్‌వాడీ, ఆశ, కార్మిక, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పెన్షనర్స్, నాలుగో తరగతి ఉద్యోగులతో ఈ సమావేశం ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే సన్నాహక సమావేశం నిర్వహించి వేదిక, ఇతర వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ శ్రీమహలక్ష్మమ్మ, శ్రీముద్దిరావమ్మ దేవాలయ పునిర్మాణంకు సోమవారం దాతలు విరాళాలు అందించినట్లు దేవాలయ కమిటీ తెలిపింది. సాయిగ్రానైట్ అధినేత ఊడుగు శ్రీనివాసరావు అరుణ దంపతులు రూ.10,116, బ్యాంక్ కాలనీకి చెందిన రాయల వెంకటనారాయణ ఉదయలక్ష్మి దంపతులు రూ.10, 116 విరాళం అందించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే కనకయ్యతో నాయకులు

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను పింజరమడుగు ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, తాళ్లగూడెం సర్పంచ్ లకావత్ సునీత సోమవారం టేకులపల్లి మండలంలోని కోయగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లమోతు రవి, వెంకటనర్సయ్య, లకావత్ మంగీలాల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	పిండం, జోరుగా హుషారుగా
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	66		10
బెండకాయ	70	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	68	చుక్కకూర	3
బీర	66		20
దొండ	74	తోటకూర	3
పొట్లకాయ	40		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	66		10
క్యాబేజీ	20	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	36		10
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	60		20
ఉల్లిగడ్డ	46	-ఖమ్మం వ్యవసాయం	

ఆదాయమంటే అలుసా?

కేఎంసీలో ఆస్తిపన్ను వసూళ్లపై అలసత్వం
- దృష్టి సారించని ఉద్యోగులు
- రూ.32.98 కోట్లకు గాను వసూలైంది రూ.13.86 కోట్లే
- ఇందులో 'ఎర్లీ బర్డ్' రాబడే రూ.8.40 కోట్లు



కేఎంసీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)కు వచ్చే ఆదాయంలో ఆస్తి పన్నుదే సింహ భాగం ఉంటుంది. ఆస్తిపన్ను వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని కేఎంసీలో అభివృద్ధి పనులు, పరిపాలన అవసరాలకు ఖర్చు చేస్తుంటారు. అందుకే ఆస్తి పన్నుతో పాటు ట్రేడ్ లైసెన్సుల ఫీజుల ద్వారా ఆదాయాన్ని రాబట్టాల్సి ఉంది. కానీ కేఎంసీ అధికారులు ఈ పన్నుల వసూళ్లపై అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

లక్ష్యంలో సగం కూడా రాలే...

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేఎంసీ పరిధిలో రూ.32,98,86,000 ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా మూడున్నర నెలల సమయే ఉంది. అయితే, ఇప్పటి వరకు రూ.13,86,94,000 మాత్రమే వసూలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల పాటు ఆ విధుల్లో ఉన్న సిబ్బంది ఎన్నికల అయిపోయిన తర్వాతైనా దృష్టి సారించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ట్రేడ్ లైసెన్సుల ద్వారా వచ్చే ఆదాయంపై కేఎంసీ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్స్‌లపైనా అదే నిర్లక్ష్యమే..

ఆస్తి పన్నుతో పాటు నగరంలో ట్రేడ్ లైసెన్సుల ద్వారా కేఎంసీకి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. నగరంలో ప్రతీ వ్యాపారి ట్రేడ్ లైసెన్సు తీసుకొని వ్యాపారం చేయాల్సి ఉంది. అయితే నగరంలో చాలా వరకు లైసెన్స్‌లు లేకుండా, లైసెన్సు ఉన్న వారు రెన్యువల్ చేయించుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో కేఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ట్రేడ్ లైసెన్సుల ఫీజులు సక్రమంగా వ్యవహరిస్తే సుమారు రూ.2 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఇందులో రూ.లక్షలు కూడా వసూలు చేయకపోవడం కేఎంసీ యంత్రాంగం తీరును తెలియచేస్తోంది.

ఎర్లీబర్డ్‌తో రూ.8.40 కోట్లు..

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లపై కమిషనర్ ఆదర్శ్ సురభి ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాళ్లల్లో ప్రత్యేక దృష్టి సారించారు. 'ఎర్లీ బర్డ్' (ఐదుశాతం రాయితీతో చెల్లింపు) స్కీంపై నగర ప్రజలకు అవగాహన కల్పించి, స్వయంగా తానే క్షేత్రస్థాయిలో తిరుగుతూ పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ స్కీంతో కేఎంసీ పరిధిలో ఏప్రిల్ నెలలో 12,132 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.8.40 కోట్లు వసూలు చేశారు. ఇప్పటి వరకు రూ.13.86 కోట్లు వసూలు చేస్తే స్కీంలో వచ్చిన నగదే ఉంది. ఇక మే నెల నుండి ఇప్పటి వరకు ఎనిమిది నెలల్లో రూ.5.40 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా మూడున్నర నెలలు మాత్రమే ఉండడంతో ఆలోగా రూ.19,11,92,000 వసూలు చేయడం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మంత్రి పొంగులేటికి శుభాకాంక్షల వెల్లువ



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రెసా జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దివ్యాంగులు

ఖమ్మం సహకారనగర్: పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై సమీక్షించేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అలాగే, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్, నాయకులు నాయకులు నందగిరి శ్రీను, జీఎస్.ప్రసాద్, నాగుల్‌మీరా, కట్టా నవీన్, వెంకటరెడ్డి, శివ, ప్రసాద్, రాజేష్, భాస్కర్, శాబాసు జ్యోతి, స్వప్న, శాంత కుమారి, స్వర్ణలత శుభాకాంక్షలు తెలిపారు. ఇక టీఎన్జీవోస్‌లో మరోవర్గం నాయకులు కొణిదన శ్రీనివాస్, దుర్గాప్రసాద్, గుంటుపల్లి శ్రీనివాస్, బాలకృష్ణ, విజయ్, వెంకట్రావు, శ్రీకాంత్, రవిచంద్ర హరికృష్ణ, యాకూబ్ తదితరులు కూడా మంత్రిని కలిశారు. అలాగే, మంత్రి శ్రీనివాసరెడ్డిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.నాయకులు కారుమంచి శ్రీనివాసరావు, శ్రీలత, రాంబాబు, ప్రసాద్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడిన క్యాంప్ ఆఫీస్

ఖమ్మంవన్‌టౌన్: మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఖమ్మం వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు సోమవారం ఆయన క్యాంపు ఆఫీస్‌కు ఆయన అభిమానులు, నాయకులు భారీగా తరలిరావడంతో క్యాంపు ఆఫీస్ కళకళలాడింది. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఉదయం 6గంటలకు మొదలైన శుభాకాంక్షల వెల్లువ మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగింది.

ఖమ్మంరూరల్: మంత్రి పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా పాలేరు నియోజకవర్గం, ఖమ్మం వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మద్ది వీరారెడ్డి, బత్తుల కూర్మారావు తదితరులు ఉన్నారు.

పనుల కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జమలారెడ్డి

నేలకొండపల్లి: ఉపాధి హామీ పథకం పనులను గ్రామసభల ద్వారా గుర్తించాలని, ప్రతీ పంచాయతీలో కూలీలకు తగ్గట్టుగా పనులను ఎంపిక చేయాలని ఎంపీడీఓ కె.జమలారెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈజీఎస్ అధికారులు, సిబ్బందిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... కూలీలకు పనుల కొరత లేకుండా సరిపడా పనులు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న యర్రా శ్రీకాంత్

రఘునాథపాలెం: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన రఘునాథపాలెం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అకాల వర్షానికి వరి, మిరప, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మండలంలో 1,600 ఎకరాల్లో వరి, 1,400 ఎకరాల్లో మిర్చి, 50 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సర్వే ద్వారా తేల్చారని వీరికి నష్టపరిహారం వెంటనే అందజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, మండల కార్యదర్శి నవీన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, కన్నెగంటి తిరపయ్య, వల్లూరి శీను, గుగులోత్ కుమార్, నాగేశ్వరరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు హిమాం, హరి, రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నేలకొండపల్లి: కరపత్రాలను పంపిణీ చేస్తున్న వలంటీర్ నాగమణి, తదితరులు

నేలకొండపల్లి: ఈ నెల 30న పోలేపల్లి వద్ద జరిగే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పారా లీగల్ వలంటీర్ కొలిపాక నాగమణి కోరారు. మండల కేంద్రంలో సోమవారం లోక్ అదాలత్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీమార్గం రాజమార్గం అని, అందుకే ఇరువర్గాల వారు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. ప్రతీ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. న్యాయ సేవలు, ఉచిత న్యాయ సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు, కళాకారుల సంఘం నాయకులు భిక్షం, యువజన సంఘం ప్రతినిధి కడియాల నరేష్ పాల్గొన్నారు.

కామేపల్లి: ఈ నెల 30న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పారా లీగల్ వలంటరీ ఆదూరి సత్యావతి కోరారు. మండలంలోని కొమ్మినేపల్లి గ్రామంలో లోక్ అదాలత్ కార్యక్రమంపై ముమ్మర ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పలు రకాల పాత కేసులను పరిష్కరించుకొనేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. స్నేహ భావంతో మెలగడానికి ఈ అదాలత్ ఎంతో దోహద పడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసును మూసేయవచ్చన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన మజీద్‌పాషా

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడికి చెందిన షేక్ మజీద్‌పాషా కాకతీయ యూనవర్సిటీ స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి చాంపియన్‌షిప్ 2023–2024 గాను మొదటి స్థానంలో నిలిచాడు. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీలో విద్యనభ్యసిస్తున్న మజీద్‌పాషా సోమవారం వరంగల్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ మేరకు పలువురు మజీద్‌పాషాను అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ట్రంక్ రోడ్డులో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య కార్య నిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణ శర్మలు సాంప్రదాయ పద్ధతిలో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైద్యశిబిరం..

శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో హైదరాబాద్ యశోదా హాస్పటల్స్ సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో..



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: మ్యాథ్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు టి.రేవంత్‌కుమార్, కె.ఫణీంద్ర చౌదరి, సీహెచ్.కృష్ణ మాథుర్, శ్రీకర్‌రెడ్డిని కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి సోమవారం అభినందించారు. ఐఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో దయాకర్‌రెడ్డి

కూసుమంచి: కాంగ్రెస్‌లో చేరిన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రేల వెంకటరెడ్డి, కొర్రా రమేష్, యాసా సత్యనారాయణ రెడ్డి, షేక్ మీరా సాహెబ్, బైరిశెట్టి కోటయ్య, రాంరెడ్డి, ఉపేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

ఖమ్మంక్రైం: తెలంగాణ రాష్ట్రంలో హోంగార్డ్ ఆఫీసర్లను పర్మినెంట్ చేసి రెగ్యులర్ ఎంప్లాయిస్‌గా గుర్తించాలని కోరుతూ హోంగార్డ్ ఆఫీసర్స్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. కారుణ్య నియమాకాలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన పొంగులేటి తప్పకుండా పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షుడు బంక శ్రీను, ముత్తుజ, నీరజ, రహీం, రామకృష్ణ, బోలేపాషా, వెంకన్న, గురుమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకే పనిచేస్తాం

ఖమ్మంవన్‌టౌన్: ప్రజల అభీష్టం మేరకే పనిచేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మల గెలుపునకు పనిచేసిన ఒక్కో నాయకుడిని కలుస్తూ ధన్యవాదాలు తెలుపుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా నియోజకవర్గ సమస్యలను తెలుసుకుంటూ, అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా సమస్యలను తీరుస్తామని మాట ఇచ్చామని స్పష్టం చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ఖమ్మంగాంధీచౌక్: కేక్ కట్ చేస్తున్న ఫాదర్లు



ఖమ్మంమామిళ్లగూడెం: మాట్లాడుతున్న రవీందర్‌రావు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్లు తాళ్ల లాజర్ గువ్వల ప్రవీణ్, లూర్దు కిరణ్, సభ్యులు మరియదాసు, నాగరాజు, నరేష్, మురళి, ఉపదేశి, రాజు, శంకర్ పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని సీనియర్ సిటీజెన్స్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, సంస్థ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి సాదినేని జనార్ధన్‌రావు, సభ్యులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పుల్లయ్య, రాఘవయ్య, రాధాకృష్ణ, మోహన్, ఉపేందర్‌రెడ్డి, గణపతిరాజు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం లీగల్: జై భీమ్ న్యాయవాదుల ఐక్య వేదిక కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఖమ్మం టీఎన్జీఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్ కుమార్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మన్నెపల్ల బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మవారు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో పెద్దమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ మెంటం రామారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని గాయత్రీ అమ్మవారి దేవాలయంలో శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు దేవాలయ ప్రధాన అర్చకులు యామజాల శేషగిరిశర్మ తెలిపారు. అభిషేకం, అగ్ని సంస్కారం, అర్చన, ప్రతిష్ఠ అనంతరం అన్నదానం చేశారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు మరమ్మతులు చేసేదెవరు..?



మామిళ్లగూడెంలో గుంతలమయంగా మారిన రోడ్డు



- గుంతలతో అధ్వానంగా తయారైన అంతర్గతరోడ్డు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో గల అంతర్గత రోడ్డు మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఏపీజీవీబీ నుంచి మామిళ్లగూడెం రామాలయం వరకు వెళ్లే ఈ రహదారి మాత్రం అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలోని రోడ్డుకు ఇరువైపుల రోడ్లు ఆధునీకరించి, సీసీ, వీడీఎఫ్ రోడ్లుగా నిర్మాణం పూర్తి చేశారు. రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో మాత్రం ఈ రోడ్డుపై మోకాళ్ల లోతు నీళ్లు చేరుతున్నాయి. 49, 45వ డివిజన్లను విభజిస్తూ ఉన్న ఈ రోడ్డును రెండు డివిజన్ల కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని, అధికారులు సైతం ఈ రోడ్డుపై దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తమ డివిజన్ పరిధి కాదంటే తమ డివిజన్ పరిధి కాదని పాలకులు రోడ్డుకు కనీస మరమ్మతులు కూడా చేయించడం లేదని ఆవేదన చెందుతున్నారు.